టీవీ సీరియల్స్ చూసే అలవాటు లేదు. ఇప్పుడొస్తున్న రియాల్టీ షోల మీద నమ్మకమూ లేదు. అందుకే -అవకాశాలు వచ్చినా వాటి జోలికి పోలేదు. మానవ సంబంధాలను యిష్టపడే వ్యక్తిగా -జీవన గాథలను ప్రేక్షకులతో పంచుకునే అవకాశం ఇప్పటికి వచ్చింది. అందుకే సరికొత్త సుమలతగా -'బతుకు' వాస్తవాలను చూపించేందుకు 'జట్కా బండి'లో మీ యింటికి వస్తున్నా. త్వరలోనే కలుద్దాం.

-సుమలత



# బుల్లి తెరపై సుమలత

సుమలత -టెలివిజన్ -బతుకు జట్కా బండి.

చాలాకాలం తరువాత వినిపించిన సుమలత వ్యాఖ్యలకు ఇవి కీవర్డ్స్. విషయం అర్థమైపోతుంటుంది. వెండితెర కంటే ఇంటితెర వేల్యూలకే అభిమానులు పెరుగుతోన్న క్రమంలో -గతతరం హీరోయిన్లు సెకెండ్ ఇన్నింగ్స్‌ను స్మాల్ స్క్రీన్ నుంచే మొదలు పెడుతున్నారని చెప్పడానికి ఎందరో ఉదాహరణలు. ఇప్పుడు -ఆ జాబితాలో సుమలత కూడా. సిల్వర్ స్క్రీన్ పాపులార్టీ తగ్గిన తరువాత కన్నడ నటుడు అంబరీష్‌ను పెళ్లి చేసుకుని ఇంటికే పరిమితమైన సుమలత -ఇప్పుడు ఇంటితెరపై సరికొత్త పాత్రలో కనిపించబోతోంది. -ఎత్తుపల్లాలు ఒడిదుడుకులు, బాధలు కన్నీళ్లుమయమై ఒడార్పు కూడా కరవైన ఒంటరి బతుకులను ప్రత్యక్షంగా చూపించే వ్యాఖ్యాత పాత్ర అది. దక్షిణాది భాషల పట్ల మమకారాన్ని ప్రదర్శించే సుమలత -పదిహేనేళ్ల వయసులోనే సినీ పరిశ్రమలోకి అడుగు పెట్టి భిన్నమైన పాత్రలను పోషించి నటిగా నిరూపించుకుంది. చదువుకునే వయసులో ఆమె నేర్చుకున్న భాషలే ఆమెకు -కన్నడ, తమిళ చిత్రాల్లో కూడా మంచి అవకాశాలు, పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టాయి. కొత్త నీరు వచ్చిన తరువాత హీరోయిన్ వేషాలకు గుడ్‌బై చెప్పి పెళ్లి చేసుకుని సెటిలైపోయిన సుమలత -చాలాకాలం గ్యాప్ తరువాత మళ్లీ చిన్నితెరపై వ్యాఖ్యాతగా కనిపించబోతోంది. -'బతుకు జట్కా బండి' కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించేందుకు అంగీకరించడంలో ఓ అర్థం ఉంది. బుల్లితెరపై కన్పించే చాలా కార్యక్రమాల్లా కాలక్షేపం వ్యవహారం కాదిది. సమాజంలో అన్యాయాలకు, దౌర్జన్యాలకు బలై ఒదార్పులేని ఒంటరి అభాగ్యులకు మేమున్నామంటూ జనం నుంచి ధైర్యాన్నిచ్చే ప్రయత్నం. ఈ కార్యక్రమం చూస్తున్న సేపూ మీ మెదడులో సవాలక్ష ఆలోచనలు రేకెత్తుతాయి. సమాజం పట్ల మన బాధ్యతను తట్టిలేపుతాయి. ఏ ఒక్కరి ఆనందం, లాభం కోసమో రూపొందించిన కార్యక్రమం కాదు కనుక, సమాజాన్ని సంస్కరించే ప్రయత్నంలో మీరూ భాగస్వాములు అవుతారు' అని సుమలత ఘంటాపథంగా చెప్తోంది. సినిమా తెరపై ఎక్కువ శాతం సంప్రదాయబద్ధంగా కనిపించిన సుమలత -బుల్లితెరపైనా అలాంటి ప్రబోధాత్మక కార్యక్రమాన్ని ఎంచుకోవడం హర్షణీయం. గుడ్‌లక్ సుమలత.

- విజయ్